సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 14-3-2025

సంపుటి: 20 సంచిక: 298

పేజీలు: 8 వెల: రూ.1


## రాష్ట్ర కళింగకోమటి అధ్యక్ష పదవికి బోయిన రాజీనామా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కళింగకోమటి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా వ్యవహరిస్తున్న కోటబొమ్మాళికి చెందిన బోయిన గోవిందరాజులు తన పదవికి రాజీనామా చేసినట్లు కళింగవైశ్య సామాజిక మాధ్యమాల్లో ఆయన పేరుతో ఒక స్టేట్‌మెంట్ హల్‌చల్ చేస్తోంది. తెలుగుదేశం పార్టీ ఇచ్చిన కళింగకోమటి ఇచ్చిన బీసీ సాధికార కమిటీ కన్వీనర్‌గా మాత్రమే ఉంటానని, రాష్ట్ర కళింగకోమటి సంఘ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ఆయన పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. నగరంలో కిన్నెర థియేటర్ ఎదురుగా ఉన్న కళింగవైశ్య కల్యాణ మండపం అంశంలో ఇటీవల సామాజిక మాధ్యమాల వేదికగా మాటల యుద్ధం జరుగుతోంది. వైశ్యరాజు అప్పలరాజు జిల్లా కేంద్రంలో ఈ కల్యాణ మండపం నిర్మించడం వెనుక రాష్ట్రంలో కళింగకోమట్లం దరూ వాడుకునే ఉద్దేశం ఉందని, అది కేవలం నగర సంఘానికే కాదనేది బోయిన గోవిందరాజులు అభిప్రాయం కాగా, అది నగర కమిటీకి చెందినదని, ఆస్తులు, అద్దులు నగర సంఘానికే చెందుతాయంటూ మరికొందరు విభేదిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో రెండు రోజులుగా గొడవ పెద్దది కావడంతో మనస్తాపం చెందిన బోయిన గోవిందరాజులు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారని తెలుస్తుంది. గోవిందరాజులు నాయకత్వం పట్ల కళింగకోమట్లలో ఏకాభిప్రాయం ఉన్నా, ఆయన్ను కొందరు తప్పుదోవ పట్టించారన్న భావన వాట్సాప్ గ్రూపుల్లో వ్యక్తమవుతోంది.










- బీసీ వెల్ఫేర్, ఏసీబీ అధికారుల మధ్య బలమైన బంధం
- రెండోసారీ తప్పించుకున్న సూపరింటెండెంట్
- ఏసీబీ సిఫార్సులు పట్టించుకోని బీసీ సంక్షేమ శాఖ
- చర్యలు తీసుకోవాల్సిన వారిపై ఉపేక్ష
- డబ్బులు తీసుకొని ఫోకల్ పాయింట్‌లో ఉద్యోగాలు

"2008 నుంచి అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన అనేక దాడుల్లో వార్డెన్లపై తీసుకున్న చర్యల వివరాలు బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో గాని, ఏసీబీ అధికారుల వద్ద గానీ లేవు. రైడ్‌లో పట్టుబడ్డ వార్డెన్లు దర్జాగా ఎటువంటి శిక్షలు లేకుండా ఉద్యోగాలు చేస్తున్నారు."

"ఏసీబీ అధికారులు హాస్టల్స్‌పై దాడులు నిర్వహించి, దర్యాప్తు చేసి సిఫార్సులతో ప్రభుత్వానికి నివేదిక పంపిన తర్వాత ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకోవాలి. ఆ చర్యలు ఏసీబీ అధికారులు తయారుచేసిన ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ ప్రాప్తికి ఉండాలి. కానీ బీసీ సంక్షేమ శాఖలో ఆ విధానం పాటించకుండా ఏసీబీ ఏ ఛార్జెస్ ఫ్రేమ్ చేసింది అని చూడకుండా వారి ఇష్టానికి ఛార్జెస్ ఫ్రేమ్ చేసి నామమాత్రపు చర్యలు తీసుకుంటున్నారు. 2016 ఆగస్టులో పలాస బీసీ వెల్ఫేర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్‌పైన దాడులు చేసిన ఏసీబీ అధికారులు ఛార్జెస్ ఫ్రేమ్ చేయకుండానే బీసీ వెల్ఫేర్ అధికారులు అప్పటి వార్డెన్ కొంచాడ గురువులుపైన ముందుగానే ఛార్జెస్ ఫ్రేమ్ చేసి ఏసీబీ అధికారులను రికార్డులు, సాక్ష్యాలు అడకుండానే రెండు ఇంక్రిమెంట్లు కోత పెట్టి చర్యలు తీసుకున్నాం పో.. అని విడిచిపెట్టేశారు. అలాగే ఏసీబీ దాడులు చేసిన తర్వాత సంబంధిత వార్డెన్లపైన ఎటువంటి చర్యలు తీసుకున్నామో తెలియపరిచే నివేదిక ఏసీబీ అధికారులకు ఇవ్వకుండా తొక్కిపెట్టి ఉంచేస్తున్నారు."



Nine held in scholarship scam

OUR BUREAU

Srikakulam: ACB sleuths arrested nine persons involved in scholarship scam, here on Monday. According to the ACB DSP K Rajendra Kumar, the arrested were identified as B Ravichandra, B Chandra Sekar, B BalaRaju, B Yerrannaidu, S Jhansi Rani, G Venkata Naidu, D Parvathi, M Uma Maheswar Rao and A Ajay kumar. The worth of the scam is Rs 82 lakh and the accused diverted funds from 2009 to 2016. Out of total nine accused six are in service, one retired and two are private persons.

THE HANS INDIA

## దమ్ముంటే పట్టుకో ఏసీబీ..

# డబ్బుకొట్టి వచ్చేస్తాం డ్యూటీకి

"2017 జులైలో శ్రీకాకుళం ఏసీబీ అధికారులు ఆమదాలవలస, తోటవాడ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఆకస్మిక దాడులు నిర్వహించి పలు లోపాలు గుర్తించారు. అప్పటి ఏబీసీడబ్ల్యూవో శ్యామలకుమారిని ఆమదాలవలస హాస్టల్‌కు పిలిపించి ఆమె సమక్షంలో పంచనామా పూర్తిచేశారు. ఈ సందర్భంగా తాను ఈ హాస్టల్‌ను పలుమార్లు సందర్శించానని, వార్డెన్లపై చర్యలకు సిఫార్సు చేస్తూ జిల్లా కార్యాలయానికి నివేదిక ఇచ్చానని ఏసీబీ అధికారులకు తెలుపుతూ అందుకు సాక్ష్యంగా ఒక లేఖ జిరాక్స్‌ను స్వయంగా ఏసీబీ అధికారులకు అందించారు. దీని మీద అనుమానం వచ్చిన ఏసీబీ అధికారులు అసలు ఈ లేఖ వాస్తవికత ఎంతో తెలుసుకోవడం కోసం జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయానికి లిఖితపూర్వక సమాధానం కోరారు. అసలు అటువంటి లేఖే తమ కార్యాలయానికి శ్యామలాకుమారి నుంచి చేరలేదని స్పష్టం చేశారు. శ్యామలాకుమారిపై ఏసీబీ అధికారులను తప్పదోవ పట్టించినందుకు, ఆమె పర్యవేక్షణ సంబంధిత హాస్టల్‌లో సరిగా లేనందుకు చర్యలు తీసుకోవాల్సిందిపోగా ఇంతవరకు ఎటువంటి యాక్షనూ లేదు. విచిత్రమేమిటంటే.. తమను తప్పదోవ పట్టించిందంటూ ఏసీబీ అధికారులు ప్రభుత్వానికి ఒక నివేదిక పంపితే, దాని ఆచూకీ ఇప్పటికీ తేలలేదు."

"జిల్లాలో సంచలనం సృష్టించిన స్కాలర్‌షిప్‌ల కుంభకోణంలో కూడా తక్కువ మొత్తంలో ఆర్థిక నష్టం జరిగిన కాలానికి సంబంధించిన అధికారులు, సిబ్బందిని అరెస్ట్ చేసి న్యాయ స్థానంలో ఛార్జిషీటు వేసి ఏసీబీ అధికారులు ఈ వ్యవహారం వెలుగుచూడకముందే పెద్ద ఎత్తున ప్రభుత్వసొమ్మును తినేసిన అధికారులు, సిబ్బందిని అరెస్ట్ చేయకపోవడం, అరెస్ట్ చేసినవారి పేర్లు ఛార్జిషీటులో చేర్చకపోవడం జిల్లాలో ఏసీబీకి, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులకు ఉన్న లోపాయికారీ ఒప్పందాలకు నిదర్శనం."

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లా బీసీ సంక్షేమ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న బాలరాజు ఇదే శాఖలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు సంబంధించిన ఎరియర్స్ మంజూరు కోసం సొమ్ములు తీసుకుంటూ రెండు రోజుల క్రితం ఏసీబీకి దొరికిపోయిన విషయం పాఠకులకు తెలుసు. అయితే ఆయన ఏసీబీకి పట్టుబడటం ఇది రెండోసారి. ఒకసారి ఏసీబీకి పట్టుబడి ఆ కేసు ఇంకా నడుస్తుండగా, మళ్లీ లంచం తీసుకోడానికి ఎంత ధైర్యం ఉండాలి?! అనే ప్రశ్న ఉద్యోగ వర్గాల్లో - మిగతా చివరి పేజీలో




# పెద్దాసుపత్రికి పురిటినొప్పులు..!






ఇన్ని ఉచిత పథకాలెందుకు? ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అడిగిందెవరు? కేవలం విద్య, వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తే చాలన్న వాదన ఎన్నో ఏళ్లుగా ఎంతోవంది నుంచి వినిపిస్తున్నా, ఆ దిశగా మాత్రం ప్రయత్నాలు జరగడంలేదు. మెడికల్ కాలేజీలు పెరుగుతున్నాయి. అందులో సీట్లూ పెరుగుతున్నాయి. ప్రతీ ఏటా బయటకు వచ్చే వైద్యులూ పెరుగుతున్నారు. కానీ రోగులకు అందే సేవలు మాత్రం గతం మాదిరిగానే ఉన్నాయంటే అందుకు కారణం ఎవరు? కోవిడ్ తర్వాత కూడా ప్రభుత్వాలు గుణపాఠం నేర్చుకోపోతే ఆ తప్పెవరిది?

- కళాశాలకు అనుబంధమైనా సౌకర్యాల లేమి
- ఐసీయూ కంటే జనరల్ వార్డు నయం
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసవానికి లక్షలు ఖర్చు
- ప్రభుత్వాసుపత్రుల్లో లోపించిన మానవీయ కోణం
- ఏసీలున్న చోట విసనకర్రలే దిక్కు
- ఫ్యాన్లు తెచ్చుకోవడం పేషెంట్ల బాధ్యత

"శ్రీకాకుళం ప్రభుత్వాసుపత్రికి డెలివరీకి వెళ్తున్నారా..? అక్కడ హైబ్రిడ్ ఐసీయూ అని ఒకటుంటుంది. నిండా ఏసీలు, ఒంటికి చెమట పట్టకుండా పరుపులు, సురక్షితమైన నీరు ఉంటాయి. కాకపోతే ఫ్యాన్లు, విసనకర్రలు, దుప్పట్లు మీరే పట్టుకెళ్లాల్సి ఉంటుంది. ఎందుకంటే పైన చెప్పినవి పనిచేయవు. ఇక నీరంటారా మీ ఇంటి నుంచి తెచ్చుకున్న వాటర్ బాటిళ్లు పట్టుకొని నాలుగు మెట్లు దిగి సత్యసాయిబాబా నిత్యాన్నదాన పథకం వారి వద్దకు వెళితే వారు వేడినీరు ఇస్తారులెండి."

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో కిడ్నీ రోగులు ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ కిడ్నీ మార్పిడి చేసే ఆసుపత్రి ఉందా? హృద్రోగులు అన్ని చోట్లా ఉన్నారు. కనీసం రెండు స్టంట్లు వేసే ప్రభుత్వ ఆసుపత్రులు ఇక్కడ ఉన్నాయా? మేజర్ యాక్సిడెంట్ జరిగింది. తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. చికిత్స చేసే పరిస్థితి ఇక్కడ ఉందా? పై వాటిలో అన్ని కేసుల్లోనూ రిఫర్ మాత్రమే ఇక్కడి పెద్దాసుపత్రి చేయగలిగేది. కారణం.. స్పెషలిస్ట్‌లు లేకపోవడం ఒకటైతే, అందుకు తగిన మెకానిజం లేకపోవడం రెండో కారణం. అంతేసి పెద్ద జబ్బులు రావడం మన పాపం కాబట్టి, మన ఖర్మకు మనమే ఏ ప్రైవేటు ఆసుపత్రుల్లోనో చేరి లక్షలాది రూపాయలు బిల్లు కట్టాలి. తప్పదు. కనీసం తల్లీ బిడ్డ క్షేమం కోసం ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు ఆ విభాగం మీద కూడా దృష్టి సారించకపోవడం బాధాకరం. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీకే లక్షలు తీసుకుంటున్నారు. ఇక సిజేరియన్‌తో పాటు బిడ్డ అడ్డం తిరిగినప్పుడు చేసే ఆపరేషన్లకైతే అంతే లేదు. ఠాగూర్ సినిమాలో చిరంజీవి చెప్పినట్టు డాక్టర్ వద్ద చెప్పకూడనిది ఎంత డబ్బులు ఖర్చయినా ఫర్వాలేదు అని మరోసారి రుజువు చేస్తున్నారు. ప్రసూతి కోసం ఆసుపత్రికి వెళ్లినా కనీస సౌకర్యాలు గర్భిణీకి, లేదా బాలింతకు కల్పించడంలో విఫలమవుతున్నాం. ఈ కోణంలో స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రసూతి విభాగం కోసం ఒక్కసారి చర్చించుకుందాం.

పేరుకే పెద్దాసుపత్రి.. అయినా సేవలు మాత్రం ఆ స్థాయిలో అందడం లేదన్న ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. కొత్తగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాప్రతినిధులు రిమ్స్‌లో పర్యటించి హడావుడి చేయడం, ఆ తర్వాత కన్నెత్తి చూడకపోవడం సర్వసాధారణమైపోయింది. మన జిల్లాలో బీద బిక్కి, రైతు, కూలీ మాత్రమే ప్రభుత్వాసుపత్రిలో చికిత్సకు వస్తారు. వీరికి అక్షర జ్ఞానం అంతంత - మిగతా చివరి పేజీలో

• ఎడిటోరియల్

# కబళిస్తున్న కాలుష్యం

భారతదేశం క్రమంగా కాలుష్య కాసారంగా మారుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. స్విస్ ఎయిర్ టెక్నాలజీకి చెందిన ప్రతిష్టాత్మక సంస్థ 'ఐక్యూ ఎయిర్' తాజాగా విడుదల చేసిన 'ది వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్–2024' ప్రకారం ప్రపంచంలోని ఇరవై అత్యంత కాలుష్య నగరాల్లో పదమూడు మన దేశంలోనే ఉండటం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధాని నగరంగా ఢిల్లీ కొనసాగుతూనే ఉంది. మరోవైపు అసోం–మేఘాలయ సరిహద్దుల్లోని బైర్నిహాట్ పట్టణం వాయు కాలుష్యంలో ఢిల్లీని మించిపోయి, అత్యంత కాలుష్య నగరాల జాబితాలో ప్రపంచంలోనే మొట్టమొదటి స్థానంలో నిలవడం మరింత ఆందోళనకరం. మేఘాలయకు చెందిన ఈ చిన్న పట్టణంలో అభివృద్ధి పేరుతో విచ్చలవిడిగా పరిశ్రమలు ఏర్పాటు చేయడమే ఈ పరిస్థితికి కారణం. తాజా నివేదిక ప్రకారం ఆస్ట్రేలియా, న్యూజీలాండ్, బహమాస్, బార్బడోస్, గ్రెనడా, ఎస్టోనియా, ఐస్‌లాండ్ దేశాలు మాత్రమే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల మేరకు వాయు కాలుష్యాన్ని నియంత్రించగలిగాయి. భారత్ 2023తో పోలిస్తే అత్యధిక కాలుష్య ర్యాంకుల్లో మూడో స్థానం నుంచి ఐదో స్థానానికి చేరి కొంత మెరుగైన ఫలితాలు సాధించినట్టు నివేదిక పేర్కొంది. పి.ఎం 2.5 స్థాయిని ఏడు శాతానికి తగ్గించగలిగినట్లు నివేదిక పేర్కొంది. అయినప్పటికీ పాకిస్తాన్, బంగ్లాదేశ్ తదితర దేశాల సరసన డేంజర్ జోన్‌లోనే ఇప్పటికీ కొనసాగుతుండటం, దేశంలో కాలుష్య నగరాల సంఖ్య పెరుగుతుండటం పొంచి ఉన్న ముప్పునకు నిదర్శనం. కాలుష్య స్థాయి ఇదే మాదిరి కొనసాగితే ఢిల్లీ ప్రజానీకం తమ జీవిత కాలంలో 11.9 సంవత్సరాలు కోల్పోతారంటూ చికాగో విశ్వవిద్యాలయానికి చెందిన ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ 2023లోనే హెచ్చరించింది. ఆ నివేదిక ప్రకారం ప్రపంచ ఆరోగ్య సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు మించిన కాలుష్యంలో దేశంలోని మెజారిటీ జనాభా మగ్గిపోతోంది. ప్రతి క్యూబిక్ మీటర్‌కు నలభై మైక్రో గ్రాముల కాలుష్యానికి అనుమతి ఇస్తూ మన దేశం రూపొందించుకున్న సొంత నాణ్యత ప్రమాణాలు సైతం ఏ స్థాయిలోనూ అమలు కావడం లేదు. జాతీయ పరిమితి కన్నా అధికంగా కాలుష్యం ఉన్న ప్రాంతాల్లో దేశంలోని 67.4 శాతం జనాభా జీవనం సాగిస్తోంది. 2023లోనే విడుదలైన 'ది లాన్‌సెట్ ప్లానెటరీ హెల్త్' నివేదిక ప్రకారం మన దేశంలోని మహానగరాలన్నీ వాయు కాలుష్యంతో అతలాకుతలమవుతున్నాయి. కాలుష్యంతో నిండిన గాలిని పీల్చడం ద్వారా దేశం మొత్తం మీద ప్రజానీకం సగటున 5.2 సంవత్సరాల జీవితాన్ని కోల్పోతున్నారు. మరోవైపు వాయు కాలుష్య సంబంధిత రోగాల కారణంగా దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 15 లక్షల మంది మరణిస్తున్నారు. దేశవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణమవుతున్న అంశాల్లో వాయు కాలుష్యం ఐదో స్థానంలో నిలుస్తోంది. ఈ కారణంగానే ఢిల్లీలో 50 శాతం మంది చిన్నారుల ఊపిరితిత్తులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంది కాబట్టే 2019 నవంబర్‌లో దేశ అత్యున్నత న్యాయస్థానం 'నరకానికన్నా అధ్వానంగా ఢిల్లీ నగరం తయారైంది' అని వ్యాఖ్యానించింది. ఆ సమయంలోనే సుప్రీంకోర్టు న్యాయమూర్తి అరుణ్ మిశ్రా 'పేలుడు పదార్థాలు అమర్చి ప్రతి ఒక్కరినీ చంపేయడం మంచిది.' అని అన్నారంటే అప్పటికే పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. అయినా పాలకుల్లో స్పందన లోపించడంతో ఆ దుస్థితి దేశమంతటికీ విస్తరిస్తోంది. వాయు కాలుష్యానికి, వాతావరణ మార్పులకు దగ్గర సంబంధం ఉందన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ల పేరుతో కార్పొరేట్లకు ఎర్రతివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు దేశవ్యాప్త వాయు కాలుష్యంలో యాభై ఒక్క శాతానికి పరిశ్రమలు వెదజల్లే విష వాయువులే కారణమని తేలినా దాని నియంత్రణకు, కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ ఆ దిశగా స్పందన శూన్యం. కార్పొరేట్ల లాభాల కోసం సామాన్యుల ప్రాణాలను ఫణంగా పెట్టే ఈ తరహా విధానాలను ప్రభుత్వాలు ఇప్పటికైనా విడనాడాలి. తక్షణం కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాలి. అడవులను పరిరక్షించడంతో పాటు, వీలైన అన్ని ప్రాంతాల్లోనూ చెట్లను పెంచాలి. ఇటువంటి చర్యలే కాలుష్య కోరల నుండి ప్రజానీకాన్ని కాపాడుతాయి.

# ఆంధ్రప్రదేశ్ రైతు సంఘంలో సభ్యులుగా చేరాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రైతు సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సభ్యులుగా చేరాలని కోరుతూ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు రైతులకు విజ్ఞప్తి చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం కొండాపురం గ్రామంలో సంఘం సభ్యత్వం క్యాంపెయిన్ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ వివిధ రైతు సమస్యల పరిష్కారానికై రాజకీయాలకతీతంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పనిచేస్తుందన్నారు. అటువంటి సంఘంలో సభ్యులుగా చేరాలని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు. కొత్తగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో తక్కువ కాలంలోనే జిల్లాలో ఉన్న అనేక సమస్యలపై అధ్యయనం చేసి సమస్యల ప్రాతిపదిక మీద ఉద్యమాలు నడుపుతూ రైతులకు అండగా సంఘం పనిచేస్తుందన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టు సాధనకు రాజకీయాలకతీతంగా ఉద్యమించాల్సి ఉందని ఇలాంటి సమస్యల పరిష్కారం కోరుతూ పనిచేసేది ఒక రైతు సంఘం మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. ఈ మధ్యకాలంలో ధాన్యం రైతుల సమస్యపై ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి రైతు సమస్యలను తీసుకు పోవడంతోపాటు జిల్లాలో విరివిగా పత్తిపంట సాగవుతున్న నేపథ్యంలో భామిని మండలంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్ళటంతో పాటు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం వంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సభ్యత్వ క్యాంపెయిన్‌లో కిమిడి రామ్మూర్తినాయుడు మజ్జి సన్యాసినాయుడు, పారినాయుడు, కల్లేపల్లి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన సేవలో చిన్నారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అన్నవితరణ సేవ ఒక వరమని, జానకి గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ పుక్కల ఉమా, మోహన్ దంపతులు శుక్రవారం అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, అన్నదానం కోటి గోవులదాన ఫలితమని, దానాలన్నింటిలో అన్నదానం మిన్న, అన్నదానానికి మించిన దానం మరొకటి లేదని, అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారు కూడా ఉన్నారని, అందుకు ఉదాహరణగా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న నిత్యాన్నదానమేనని తెలిపారు. స్థానిక పీఎన్ కాలనీలోని శ్రీశ్రీ వరసిద్ధివినాయక ఆలయం నుండి తయారుచేసిన అన్నప్రసాదాన్ని తన కుమారుడు, కుమార్తె జన్మదినం సందర్భంగా స్థానిక ఏడురోడ్ల కూడలి వద్ద నిస్సహాయులకు, పేదలకు అందించామన్నారు. ఈ సందర్భంగా అన్నదాతలైన భావన, కౌశిక్, వారి తల్లితండ్రులు పుక్కల మోహన్, ఉమా వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలని ఆలయకమిటీ, నిత్యాన్నదాన నిర్వాహక సభ్యులు తెలిపారు.



# సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

నియోజకవర్గంలోని పొందూరు మండల ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహావిష్కరణకు ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు తెలివితేటలు, మంచి గుణాలు అలవర్చుకోవాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచంలో స్కిల్స్ లేకపోతే ఎదగలేమన్నారు. తామంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నామని, ఆనాడు ప్రమాణాలు విలువలతో కూడిన విద్యను అందించేవారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నెపు రాము, మండల పార్టీ ఉపాధ్యక్షులు బాడాన గిరి, శంకర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని సెయిల్‌లో విలీనం చేయాలని, ఉక్కు పరిశ్రమకు సొంతగనులు కేటాయించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించాలని, ఉక్కు పరిశ్రమను సెయిల్లో విలీనం చేయాలని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో కార్మికులకు జీతాలు చెల్లించాలని, స్టీల్‌ప్లాంట్‌ని నడపడానికి కావాల్సిన ముడి ఖనిజాలకు మాత్రమే ఖర్చు పెట్టాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేయాలని ఇచ్చిన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీకాకుళం 7రోడ్ జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాటనే మరిచిందని, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని దుయ్యబట్టారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ నిధులు కేవలం అప్పులకే ఖర్చు చేయాలని ప్రకటించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ విధానాలను, అక్రమ తొలగింపులు ప్రశ్నిస్తున్న కార్మిక నేతలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కని పోరాటం చేసి 32 మంది ఆత్మబలిదానాలతో, ప్రాణత్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకుంటామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవింద రావు మాట్లాడుతూ విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరిగే పోరాటానికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పరిశ్రమకు అండగా ఉంటారో కార్పొరేట్‌లపక్షం వుంటారో తేల్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.ప్రకాశరావు, కె.సూరయ్య, కె.కళ్యాణి, డి.సుదర్శనం, హైమ, కె.అప్పారావు, బి.సంతోష్, కె.శ్రీనివాస్, పవిత్ర, హరీష్,ఆర్.రమేష్, ఏ.సత్యనారాయణ, రవికుమార్, బి.వాసుదేవరావు, పి.జగ్గారావు, జనార్ధనరావు, ప్రవీణ, ఢిల్లీస్వరీ తదితరులు పాల్గొన్నారు.




# కేసు నిలబడింది!

**కథ :** వైజాగ్‌లో ఇంటర్ చదివి పార్ట్ టైం జాబ్స్ చేసుకునే చందు (హర్ష రోషన్).. ఇంటర్ సెకండియర్ చదువుతున్న జాబిలి (శ్రీదేవి) ప్రేమలో పడతారు. శ్రీదేవి మామయ్య మంగాపతి(శివాజీ) పరువు కోసం ప్రాణం ఇచ్చే మనిషి. చందు - జాబిలి విషయం మంగాపతికి తెలియడంతో జాబిలి చందు ఇంట్లో ఉన్నప్పుడు శ్రీదేవి ఫ్యామిలీతో పాటు పోలీసులని తీసుకొచ్చి అతన్ని అరెస్ట్ చేయిస్తాడు. అతనిపై రకరకాల కేసులు పెట్టిస్తాడు. శ్రీదేవికి ఇంకా 18 ఏళ్ళు రాకపోవడంతో పోక్సో కేసు కూడా పెట్టిస్తాడు. చందు ఈ కేసులో పూర్తిగా ఇరుక్కుపోతాడు. చుట్టూ ఉన్న వ్యవస్థలన్నీ అతడికి వ్యతిరేకంగా పనిచేస్తాయి. ఈ స్థితిలో అప్పటిదాకా కేసే వాదించని తేజ (ప్రియదర్శి) ఈ కేసును తీసుకుంటాడు. మరి తేజ.. చందును ఈ కేసు నుంచి బయటపడేయగలిగాడా? అతడి వాదన ఎలా సాగింది? చివరికి తీర్పు ఏం వచ్చింది? ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.




**నటీనటులు:** ప్రియదర్శి లాయర్ పాత్రలో చక్కగా నటించాడు. ఒక స్టార్ హీరో చేయదగ్గ పాత్రలో అతను బలమైన ఇంపాక్టే చూపించాడు. ఐతే పతాక సన్నివేశాల్లో మాత్రం ఇంకా పవర్‌ఫుల్ నటనను ఆశిస్తాం. సినిమాలో పెర్ఫామెన్స్ పరంగా ది బెస్ట్ అంటే మాత్రం శివాజీనే. 'నైంటీస్' వెబ్ సిరీస్ తర్వాత సినిమాల్లోకి రీఎంట్రీ ఇవ్వడానికి శివాజీ సరైన పాత్రనే ఎంచుకున్నాడు. తెరపై శివాజీ కనబడగానే ఒక రకమైన భయం కలిగేలా తన పాత్రను భలేగా పెర్ఫామ్ చేశాడు శివాజీ. తనను సరిగ్గా వాడుకుంటే బిజీ విలన్ అయిపోయే ఛాన్సుంది. హర్షరోషన్ – శ్రీదేవి ఇద్దరూ టీనేజ్ ప్రేమ జంటగా ఆకట్టుకున్నారు. వయసుకు తగ్గ పాత్రల్లో ఇద్దరూ బాగా కుదిరారు. లవ్ సీన్లలో క్యూట్ గా కనిపిస్తూనే ఎమోషనల్ సీన్లలో కూడా పరిణతితో నటించారు హర్ష–శ్రీదేవి. రోహిణి తనకు అలవాటైన తల్లి పాత్రలో ఓకే అనిపించింది. సాయికుమార్ తన అనుభవాన్ని చూపించాడు. హర్షవర్ధన్ నటన మాత్రం కొంచెం అతిగా అనిపిస్తుంది. సహాయ పాత్రల్లో సురభి ప్రభావతి.. శుభలేఖ సుధాకర్.. రాజశేఖర్ అనింగి.. వీళ్లంతా బాగానే చేశారు.

**సాంకేతికవర్గం:** 'కోర్ట్'కు సాంకేతిక హంగులు బాగానే సమకూరాయి. నిర్మాణ విలు వలు సినిమాకు అవసరమైన స్థాయిలో ఉన్నాయి. క్వాలిటీ సినిమా చూస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. ఇలాంటి కథకు మద్దతుగా నిలవడం ద్వారా నాని నిర్మాతగా మరోసారి తన అభిరుచిని చాటాడు. సంగీత దర్శకుడు విజయ్ బుల్గానన్ స్వరపరిచిన లవ్ సాంగ్ ఆకట్టుకుంది. నేపథ్య సంగీతం కూడా ఓకే. కొన్ని సన్నివేశాల్లో ఆర్ఆర్ ఇంపాక్ట్ ఇంకా బలంగా ఉండాల్సిం దనిపిస్తుంది. సినిమాటోగ్రాఫర్ దినేష్ పురుషోత్తమన్ విజువల్స్ బాగున్నాయి. రామ్ జగదీష్ రచయితగా.. దర్శకుడిగా తన ముద్రను చూపించాడు. తొలి చిత్రమే అయినా.. కోర్ట్ రూమ్ డ్రామాను నడపడంలో పనితనం చాటాడు. తెలుగులో ఇలాంటి కథలు తెరకెక్కడం అరుదు. లవ్ స్టోరీ వరకు మామూలుగా అనిపించినా.. వ్యవహారం సీరియస్ గా మారి సెటప్ కోర్టుకు మారాక రైటింగ్.. టేకింగ్‌లో ప్రత్యేకత కనిపిస్తాయి.

**కమెడియన్.. క్యారెక్టర్ ఆర్టిస్టుగా మెప్పించిన ప్రియదర్శి ఇటీవల లీడ్ రోల్స్‌లో సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటున్నాడు. మంచి అభిరుచితో సినిమాలు నిర్మిస్తూ తన ప్రత్యేకతను చాటు కుంటున్న స్టార్ హీరో నాని.. ప్రియదర్శి ప్రధాన పాత్రలో ప్రొడ్యూస్ చేసిన సినిమా.. కోర్ట్. చక్కటి ప్రోమోలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందీ చిత్రం. మరి సినిమా ఎంతమేర మెప్పిం చిందో చూద్దాం పదండి.**

### కథనం-విశ్లేషణ:

హీరో నాని నిర్మాతగా సినిమా అంటే అందులో ఏదో ఒక కొత్తదనం ఉంటుందని.. ఒక అభిరుచి కనిపిస్తుందనే నమ్మకం ప్రేక్షకుల్లో ఉంది. తన ప్రొడక్షన్లో తెరకెక్కిన కొత్త చిత్రం 'కోర్ట్' ట్రైలర్ చూస్తే నిర్మాత నాని మరోసారి తన మార్కు చూపించబోతున్నట్లే కనిపించింది. 'అ!'.. 'హిట్' ఫ్రాంఛైజీ సినిమాలతో తెలుగు తెరకు సరి కొత్త కథలను పరిచయం చేసిన నాని.. ఇప్పుడు 'కోర్ట్' రూపంలో తెలుగులో అంతగా పాపులర్ కాని జానర్ సినిమాను అందించాడు. హిందీ.. మలయాళం లాంటి భాషల్లో ఆరంభం నుంచి చివరి దాకా ఒక బిగితో సాగే కోర్ట్ రూం డ్రామాలు చూస్తుంటాం. మన దగ్గర కోర్టు రూం డ్రామాలు రావని కాదు కానీ.. వాటిలో అంత ఇంటెన్సిటీ కనిపించదు. కోర్టు సన్నివేశాల్లో కూడా పాత్రలతో అల్లరి చేయించి కామెడీ పండించడం.. హీరోలకు ఎలివేషన్లు ఇవ్వడం లాంటివి మన సినిమాల్లో మామూలే కానీ.. ఆసక్తికర వాదనలతో.. ఆలోచింపజేసే సన్నివేశాలతో.. ఉత్కంఠ రేపే ఒరిజినల్ కోర్ట్ రూం డ్రామాలు మాత్రం అరుదే. 'కోర్ట్' ఆ లోటును తీర్చి.. మనకూ చెప్పుకోవడానికి ఒక ఇంటెన్స్ కోర్ట్ రూం డ్రామా ఉందని చాటుతుంది. తెలుగులో ఈ .జానర్లో ఒక రెఫరెన్స్ లాగా నిలిచే చిత్రం.. కోర్టు.

'కోర్ట్' కథేంటన్నది ట్రైలర్ చూస్తేనే అర్థమైపోయింది. టీనేజీలో ఉన్న అబ్బాయి–అమ్మాయి ఒకరికొకరు ఆకర్షితులవడం.. ప్రేమ మైకంలో విహరిస్తున్న ఆ జంట పెద్ద షాక్ తగలడం.. అబ్బాయి మీద అనేక కేసులు పెట్టిన అమ్మాయి మావయ్య ఏకంగా పోక్సో కేసులోనూ ఇరికించడం.. అబ్బాయి జీవితం సర్వనాశనం అవుతున్న దశలో ఒక యంగ్ లాయర్ తన కేసును టేకప్ చేసి వాదించి గెలవడం.. ఇలా ట్రైలర్లనోనే కథ మొత్తం విప్పేశాడు దర్శకుడు. ఇలా ముందే కథ చెప్పేసి.. రెండున్నరగంటల పాటు ప్రేక్షకులను ఎంగేజ్ చేసి మెప్పంచడం అంత తేలిక కాదు. కానీ కొత్త దర్శకుడైనప్పటికీ రామ్ జగదీష్ ఈ పనిని విజయవంతంగా పూర్తి చేశాడు. ముఖ్యంగా కోర్ట్ రూం డ్రామాను అతను నడిపిన తీరు ఈ సినిమాకు అతి పెద్ద బలం. పోక్సో చట్టం ఎంత ప్రమాదకరమో తెలియజేస్తూ అది దుర్వినియోగం అవుతున్న తీరును ఉత్కంఠభరిత.. ఆలోచన రేకెత్తించే సన్నివేశాలను తీర్చిదిద్దాడు. శివాజీ పోషించిన మంగపతి పాత్రతో సినిమాకు కావాల్సినంత ఇంటెన్సిటీ తీసుకురాగలిగాడు దర్శకుడు. కథలో కీలక మలుపు వచ్చే దగ్గర్నుంచి సినిమాను ఆ పాత్రే డ్రైవ్ చేస్తుందంటే అతిశయోక్తి కాదు.

ఆరంభ సన్నివేశాల నుంచే నేరుగా కథలోకి వెళ్లిపోవడంతో ప్రేక్షకులు త్వరగానే సినిమాలో ఇన్వాల్వ్ అయిపోతారు. ఐతే టీనేజీ జంట మధ్య ప్రేమకథ కాస్త స్పీడ్ బ్రేకర్‌లా మారుతుంది. టీనేజీ ప్రేమకథలు మామూలుగానే కొంచెం చికాకు పెడతాయి. ఇందులో సిల్లీ సీన్లు లేకపోయినా.. లవ్‌స్టోరీ సాధారణంగా అనిపిస్తుందంతే. ఆ వ్యవహారం త్వరగా ముగిసిపోయి కథలో ఎప్పుడు మలుపు వస్తుందా అని ఎదురు చూస్తాం. శివాజీ పాత్ర రూపంలో ఆ మలుపు వచ్చేస్తుంది. అబ్బాయి అరెస్ట్ అయ్యే సీన్ ఉత్కంఠ రేకెత్తించేలా తీర్చిదిద్దారు. తన చుట్టూ ఉచ్చు బిగుసుకునే సీన్లు కూడా బాగానే సాగాయి. హీరో ఈ కేసును టేకప్ చేశాక 'కోర్ట్' నెక్ట్స్ లెవెల్ కు వెళ్తుంది. కోర్టులో వాదోపవాదాలకు సంబంధించిన సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా అనిపిస్తాయి. సినిమాకు ఆ సీన్లే మేజర్ హైలైట్. చివరి వరకు అదే టెంపోను కొనసాగించాడు దర్శకుడు. క్లైమాక్సులో డైలాగులు కూడా బాగా పేలాయి. ప్రియదర్శి పాత్రతో చివర్లో ఇంకా ఇంపాక్ట్ ఇచ్చి ఉండొచ్చు కానీ.. ఎందుకో అక్కడ కొంచెం బ్యాలెన్స్ తప్పినట్లు అనిపిస్తుంది. ఆఖర్లో ఇచ్చిన సందేశం బాగుంది. ప్రేక్షకుల్లో కచ్చితంగా 'కోర్ట్' ఒక ఆలోచన రేకెత్తిస్తుంది. ఓవరాల్ గా కోర్ట్ రూం డ్రామాలను ఇష్టపడేవారు 'కోర్ట్'ను నిరభ్యంతరంగా చూడొచ్చు. తెలుగులో వచ్చిన బెస్ట్ కోర్ట్ రూం డ్రామాల్లో ఈ చిత్రం కచ్చితంగా ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...



# కలలు కూడా.. కలర్స్‌లోనే కనాలి!

**మనిషి కళ్ళు తెరచినప్పటినుంచి, వెలుతురు ప్రయాణం మొదలెట్టినప్పటి నుంచి కనిపించేవి రంగులే, రంగులుతెల్లటి కాంతి రంగులుగా ఎలా విడిపోతుందో, ఎలా మారుతుందో చెప్పినందుకే మనకి రామన్ రూపంలో నోబెల్ ప్రైజ్ దక్కింది.**

ఆదిమానవుడు గుహల గోడలపై రాళ్ళని బంకని కొవ్వులనూ అరగదీసి గీసిన రంగుబొమ్మలు చూస్తూనే సహస్రాబ్దుల క్రిందటి మన పూర్వీకుల ఆలోచనల్ని చదవ గలుగుతున్నాం.

తోళ్ళూ నారలూకట్టుకోవడం పూర్తయ్యాక బట్టలు నేయడం మొదలేసినా వాటిపై రంగులు రావడానికి చాలా కాలం పట్టింది. మొదట్లో నీలిగోరింట మొక్కల నుంచి తీసిన నీలిమందు (ఇండిగో) కోసం ప్రపంచం మనవైపు ఎంతలా చూసేదంటే ఇండియా అని అదే పేరుతో పిలిచేంత. ఆ తర్వాత కృత్రిమ నీలంతో పాటు అనేక రంగులు బట్టలకు అలముకోవడంతో అసలా మొక్క ఎలా వుంటుందో కూడా మర్చిపోయాం మనం. మంజిష్ట వేళ్ళనుంచి ఎరుపు, పసుపు కొమ్ములు ఇంకా అదే రంగుపేరుతో వుండటం, సోంపు మొక్కల (Fennel) నుంచి ఆకుపచ్చ, బొగ్గు, సుద్దల వంటివి రంగులుగా రాజ్యం ఏలాయి.

ప్రశాంతంగా కనిపించాలనుకున్నప్పుడు తెల్లటి బట్టలు వేసుకునే డాక్టర్లు ఆపరేషన్ టైంటో రక్తం చిందినా ఇబ్బంది లేని ఆకుపచ్చని యూనిఫాం చేసుకుంటే, కర్మికులకు ఖాకీ రంగు, మంచులో పసుపు ఫాగ్ లైట్లు అర్ధవంతమైన పనులు చేస్తుంటాయి.

కాన్వాసుల మీద రంగులు ఇప్పటికీ ఆశ్చర్యమే కళ్ళముందు కనిపించే దృశ్యాలను కాగితం మీదనో, క్లాత్ మీదనో చిత్రించాలనుకున్నప్పుడు నైపుణ్యం రంగుల కలయికలోనే కదా చూపిస్తుంటారు.

కోళ్ళు కొట్లాడినా వాటిని ఈకల రంగులను బట్టి కాకులనో డేగలనో పిలుచుకుంటూ సమయానికి తగు రంగులెంచి బరిలోకి దింపుతుంటాం.

అంతెందుకు మనుషులు చర్మాల రంగుల ఆధారంగా ఆధిపత్యాలను ప్రకటించుకుంటాం. కాస్తంత ఎండపడే ప్లేసుల్లో వున్నందుకు నల్లవాళ్ళుగా ఈస్టిండియాతో పిలిపించుకున్నాం.

రంగు రంగుల ఈకల తోకను విసనకర్రలా విప్పి గిరగిర తిరిగే పిట్టను జాతీయ పక్షి అంటాం. మగ నెమళ్ళకే రంగుల ఈకలుంటాయని తెలిసీ చక్కగా డాన్స్ చేసే అమ్మాయిలను నాట్యమయూరి అంటాం.

రాళ్ళు రంగుల్లో మెరసాయంటే తలమీద కూడా పెట్టుకుంటాం, బంగారంలోనో వెండిలోనో ఇమిడ్చి వేళ్ళకు తగిలించుకుంటాం. జాతకం మార్చేసేంత శక్తి రాయి అయినా దానికున్న రంగులో నింపుకునే వుంటుందని నమ్మేస్తాం.

సినిమా (వెండి) తెరల మీద నలుపు తెలుపు ఆటల నుంచి రంగులు రాగానే ఈస్టమన్ కలర్ అగ్ ఫా కలర్, ఫుజీ కలర్ అంటూ మురిసిపోయాం.

అప్పుడెప్పుడో 99లో కంప్యూటర్ ఇస్టిట్యూట్ పెట్టిన కొత్తల్లో సిఆర్ టి (కాథోడ్ రే ట్యూబ్) మానీటర్ల నుంచి రంగు ఎల్ సిడీ కొనుక్కొచ్చిన సంతోషం ఇంకా గుర్తుంది. రంగుల్ని బాగా చూసేందుకే ఎల్ ఈ డిల్లోల హెచ్ డిలూ ఎల్ హెచ్‌డీలు, యూహెచ్‌డీలు అంటూ మరింత మెరుగులు దిద్దుకుంటున్నాం.

మొబైల్స్ లో మాత్రం రంగు తెరలు రాగానే అప్పట్లో నోకియా ప్రతి జేపులోనూ రంగుంది అంటూ చేసిన ప్రకటనలు ఒక రేంజ్ లో హడావిడీ చెయ్యలేదా.

రక్తం ఎర్రగా వుండే జీవులతో నిండిన నేల మీదకు నీలిరంగు రక్తం వుండి సముద్రంలో వేల అడుగుల లోతునుంచి బయటికి వచ్చిన చేపను చూసి డూమ్స్ డే పిష్ వచ్చింది అప్పట్లో సునామీని ఇదే సూచించింది అంటూ ఆందోళన పడుతూనే వున్నాం కదా.

పళ్ళెంలో కూరగాయలు అన్ని రంగులవీ వుండేలా చూసుకుంటూ అన్ని పోషకాలూ అందినట్లే అనుకుంటాం. నీళ్ళ పీహెచ్చ తెలుసుకోవాలన్నా రంగు ఎలా మారిందో చూస్తాం. రోడ్డు మీద ఎర్ర రంగు చూస్తే ఆగుతాం, పచ్చరంగుకే సాగుతాం, మనల్ని శాసించే రాజకీయాలూ ఏదో ఒక రంగు కే అంటిపెట్టుకుని వుంటాయి. జాతీయ జెండా అయినా రంగులు దాని అర్ధాలతోనే ముడిపడివుంటుంది మరి.

ఈ కలరోపాఖ్యానం, రంగుల దండకం చివర్లో ముగింపుగా మీకో ప్రశ్న కలలు కలర్లోనే కంటున్నారా లేదా గుర్తురాకపోతే ఈ రోజు రాత్రి గట్టిగా అనుకుని పడుకోండి రేపు ఉదయం కామెంటు చేద్దురు గాని.

హోళీ శుభాకాంక్షలు...

- కట్టా శ్రీనివాస్

## పిఠాపురం చేరిన 'కొరికాన' సేన!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పిఠాపురంలో జరుగుతున్న జనసేన ఆవిర్భావ సభకు శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ సమన్వయకర్త సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ ఆధ్వర్యంలో 30 బస్సులు మరియు 150 కార్లతో ర్యాలీతో కొరికాన రవికుమార్ ప్రాంగణానికి చేరుకున్నారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా జనసేన కార్యకర్తలు నాయకులు నియోజకవర్గ ఇన్చార్జిలు పాల్గొన్నారు. దీంతో శ్రీకాకుళం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో జనసేన కార్యకర్తలు సందడి నెలకొనింది...మునుపెన్నడూ లేని విదంగా జరిగిన ర్యాలీని చూసి జన సేన వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన కార్యకర్తలకు నాయకులకు ప్రజలకు కొరికాన రవికుమార్ ఎటువంటి ఇబ్బందులు లేకుండా భోజన సదుపాయాలు మరియు వసతి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కొరికాన రవికుమార్ మాట్లాడుతూ జనసేన సైనికుల సంక్షేమం పవన్ కళ్యాణ్ గారి లక్ష్యమని అదే బాటలో మా నాయకులు అందరూ పని చేస్తారని పేర్కొన్నారు



## అక్కుమహంతికి అమరావతి సచివాలయ

- శిష్టకరణ ఉన్నతాధికారుల శుభాకాంక్షలు -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ శిష్టకరణం సంక్షేమ సంఘం 63/79 అధ్యక్షులు అక్కుమహంతి రాజ ఎంపికవడంతో వారి కార్యవర్గానికి అమరావతి సచివాలయ శిష్టకరణ ఉన్నత అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకపక్క ఉద్యోగ విధులు, మరోపక్క మా బంధువులు మమకారం అనేక చక్కటి పాత్ర పోషించే వ్యక్తి రాజా అని కొనియాడారు. కార్యవర్గానికి పూర్తి మద్దతుతో కూడిన భరోసా ఇచ్చారు. తప్పనిసరిగా రాష్ట్రంలో శిష్టకరణ సమాజం మెరుగైన ఫలితాలు సాధించుటకు మేము సైతం అన్నట్టు కలిసికట్టుగా అధ్యక్ష, కార్యదర్శులను సత్కరించారు. కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. అనంతరం శిష్టకరణ సామాజిక వర్గ అభివృద్ధికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దదిరావు గోవిందరాజులు (డీఎస్‌వో పీఎల్‌జీ సెక్షన్), రఘుపాత్రుని మల్లేశ్వరరావు (ఎస్‌వో, జీఏడీ), రాజపాత్రుని రాధాకృష్ణ పాత్రో (అసిస్టెంట్ సెక్రటరీ, కమిషనర్ ఆఫ్ ఇంటెలిజెన్స్) కరకవలస చంద్రమౌళి (అసిస్టెంట్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్) రాజా తమ్ముడు ఆబ్కారీ శాఖ ఉద్యోగి, రాజా మిత్రులు పాల్గొన్నారు.

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

## రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ రుణాలు మంజూరు చేసేందుకు ముందుకు వచ్చిందని, దానిని బీసీలంతా సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమశాఖ అధికారిణి, కార్యనిర్వాహక సంచాలకులు గడ్డెమ్మ తెలిపారు. నగరంలోని స్వర్ణకార సంఘం నాయకులతో ఆమె బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రుణాల కోసం ఈ నెల 22లోగా దరఖాస్తులు చేసుకోవాలని, దరఖాస్తులను పరిశీలించి రుణాలు మంజూరు చేస్తామని ఆమె వివరించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు అనుపోజు కోటిబాబు, ముఖ్యసలహాదారు గాడి గణపతి ఆచారి, విద్యాకమిటీ చైర్మన్ ఖండవిల్లి సిద్ధార్ధ తదితరులు పాల్గొన్నారు.

## 'జయకేతనం'కు ఎచ్చెర్ల జనసైనికులు



(సత్యంన్యూస్, రణస్థలం)

జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు ఎచ్చెర్ల నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్ ఆధ్వర్యంలో భారీగా కార్లుతో, బస్సులతో జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు తరలివెళ్లారు. నియోజకవర్గ ముఖద్వారం పైడిభీమవరం నుంచి భారీ సంఖ్యలో బయల్దేరారు. సభకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం సమన్వయ కమిటీ సభ్యులు కాకర్ల బాబాజీ, వడ్డాది శ్రీనివాసరావు, బాలి అప్పలనాయుడు, ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ ఆధ్వర్యంలో జనసైనికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు భూపతి అర్జున్, జి.సిగడాం మండల అధ్యక్షులు మీసాల రవికుమార్, జిల్లా జనసేన కార్యదర్శి బొంతు విజయ్‌కుమార్, రణస్థలం మండల జనసేన నాయకులు మైలపల్లి రాంప్రసాద్, మండల నాయకులు పాల్గొన్నారు.

భాస్కర టూర్స్ & ట్రావెల్స్
ఆన్‌లైన్ వర్క్స్
ఇ-రిజర్వేషన్, బస్ టిక్కెట్స్, వాల్వో ఎ/సి, నాన్ ఎ/సి,
రైల్వే ఫ్లైట్ టిక్కెట్స్ మొదలైనవి చేయబడును.
ఆర్ట్స్ కాలేజీ రోడ్, అంబేద్కర్ జంక్షన్ దగ్గర, శ్రీకాకుళం.
సెల్: 77320 63656, 80967 20076
btsrikakulam@gmail.com

## ల్యాబ్ టెక్నీషియన్‌ల సేవలు నిరుపమానం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రస్తుత సమాజంలో ల్యాబ్ టెక్నీషియన్ సేవలు నిరుపమానమైనవని వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ ల్యాబ్ టెక్నీషియన్ వేడుకల్ని జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సభ్యులు గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. డీఎంహెచ్‌వో టీవీ బాలమురళీకృష్ణ, డీసీహెచ్‌ఎస్ కళ్యాణబాబు, అడిషనల్ డీఎంహెచ్‌వో తాడేల శ్రీకాంత్, డీఎంవో పీవీ సత్యనారాయణ తదితరులు ల్యాబ్ టెక్నీషియన్ సేవలను కొనియాడారు. జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ యూనియన్ సెక్రటరీ బి.అప్పలరాజు, ప్రెసిడెంట్ కేశవ, హరి, రాజేంద్ర, సభ్యులు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ సభ్యులు ఎన్నో ఏళ్లుగా పదోన్నతి లేక బాధపడుతున్నారని, ఒకే క్యాడర్లో నియమించబడి అదే క్యాడర్లో రిటైరవుతున్నామని ఆవేదన తెలియజేశారు. వర్క్‌లోడ్ కూడా ఎక్కువగా ఉండటం వల్ల పీహెచ్‌లో మరో అదనపు పోస్ట్ శాంక్షన్ చేయాలని, కాంట్రాక్ట్ ఎంప్లాయిాస్ అందరికీ 100 శాతం గ్రాస్ శాలరీ ఇవ్వాలని అధికారులకు తమ సమస్యలు తెలిపారు. దీనిపై ప్రభుత్వం, అధికారులు నిర్ణయం తీసుకుంటారని హామీ ఇచ్చారు.



డోలా పౌర్ణమిని పురస్కరించుకొని అరసవల్లి సూర్యనారాయణస్వామి స్వామి ఉత్సవ విగ్రహాన్ని తిరువీధి నిర్వహించారు. అరసవల్లి దేవుని తోట వరకు స్వామివారిని ఊరేగించి, భక్తుల దర్శనానంతరం తిరిగి ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- సత్యంన్యూస్, శ్రీకాకుళం

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# పెద్దాసుపత్రికి పురిటినొప్పులు..!

(మొదటిపేజీ తరువాయి)

మాత్రంగానే ఉంటుంది. పూర్తి నెలలు నిండేవరకు గర్భిణీ తిరుగాడుతుందని భావించే పెద్దలు డెలివరీ ముందు వచ్చే మార్పుల వల్లే ఆసుపత్రికి వస్తుంటారు. వీరు ఎక్కడ ఓపీ రాయించుకోవాలి? ఎక్కడికి ఇన్‌పేషెంట్‌గా వెళ్లాలి? తెలుసుకోవడం స్వర్గానికి దారి వెతకడంలా మారిపోయింది. అక్కడ బోర్డులుంటాయి కదా.. చూసుకుని వెళ్లాలి మరి అనే సమాధానాలే తప్ప మానవీయ కోణంలో అక్కడ సేవలందించడానికి రిసెప్షన్ వ్యవస్థ ఉండదు. దీంతో ఓవైపు నొప్పులు, మరోవైపు దెప్పులు, ఇంకోవైపు నిలబడటం వల్ల అక్కడే ప్రసవిస్తారేమోనన్న పరిస్థితి ఏర్పడుతోంది.

శ్రీకాకుళం రిమ్స్‌లో లేని వసతి ఏమిటీ అని అడక్కండి. అన్నీ ఉన్నాయి. కానీ అవి పని చేయవు. ఆసుపత్రిలో అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయి. ప్రసూతి సేవల సిబ్బంది నిర్లక్ష్యం, బాధ్యాతా రాహిత్యం వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది వ్యవహరించే తీరు వల్ల వివిధ సందర్భాల్లో గర్భిణీలు, బాలింతలు ఇబ్బందిపడిన పరిస్థితులు ఉన్నాయి. సిబ్బంది రోగులతో వ్యవహరిస్తున్న తీరుపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రిమ్స్ ప్రసూతి విభాగంలో మూడు యూనిట్లకు పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది ఉన్నా గర్భిణీలకు సేవలు అందడంలేదన్న విమర్శలు ఉన్నాయి. ఓపీ కోసం గర్భిణీలు గంటల తరబడి క్యూలైన్‌లో వేచివుండాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. సమాచారం ఇచ్చేవారు లేక గర్భణీలు ఎదురు చూడాల్సిన పరిస్థితి. ప్రసూతి విభాగంలో గర్భిణులకు అత్యున్నత సేవలందించేందుకు, గర్భంలో శిశువులో లోపాలను గుర్తించడానికి, తల్లిబిడ్డల ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు అవసరమైన టిఫా స్కాన్ మినహా మిగతా సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నాయి. దీంతోపాటు ఓటీ అసిస్టెంట్స్, మెటర్నటీ అసిస్టెంట్స్ బొడ్డు తాడు కట్ చేయడం కోసం మగ, ఆడ శిశువుల తల్లిదండ్రుల నుంచి రూ.1 వెయ్యి నుంచి రూ.2 వేలు వరకు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెండు నెలల క్రితం ప్రసూతి వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో అక్రమ వసూళ్లకు సిబ్బంది పాల్పడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సమావేశం నిర్వహించి అక్రమ వసూళ్లకు పాల్పడినట్టు ఫిర్యాదులు వస్తే ఉద్యోగులను టెర్మినేట్ చేస్తామని హెచ్చరించినట్టు తెలిసింది. అయినా వారి పనితీరులో మార్పు రాలేదు.. అది వేరే విషయం.

### స్పందించని సిబ్బంది..

ప్రసూతి వార్డులో పూర్తిస్థాయిలో వైద్యులు ఉన్నా సిబ్బందే గర్భిణీలకు, బాలింతలకు వైద్యసేవలు అందిస్తారని ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు అందించాల్సిన సేవలు సకాలంలో అందడం లేదని, వారి స్థానంలో సిబ్బందే వైద్యం చేస్తున్నారని రోగుల సహాయకులు చెబుతున్నారు. సిబ్బంది ఉన్నా రోగుల ఇబ్బందులపై సకాలంలో స్పందించరనే విమర్శలు ఉన్నాయి. వైద్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన తర్వాత రోగులకు వైద్యం అందిస్తున్నారని రోగుల సహాయకులు ఆరోపిస్తున్నారు. ప్రసూతివార్డుల్లో మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉంటున్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. రిమ్స్ ప్రసూతి విభాగంలో విధులు నిర్వహిస్తున్న వైద్య నిపుణులందరికీ ప్రైవేట్ క్లినిక్‌లు ఉన్నాయి. వీరంతా హైరిస్క్ కేసులను వారి ఆసుపత్రులకు తరలించుకుపోతున్నట్టు విమర్శలున్నాయి. వార్డులో వైద్య సిబ్బంది ఉన్నా రోగుల ఇబ్బందులను పట్టించుకోరని ఆరోపణలు ఉన్నాయి. వైద్యులు స్పందించక పోవడం, సిబ్బంది తీరు వల్ల గర్భిణీలు ప్రైవేట్‌లో వైద్యం చేయించడానికి మొగ్గు చూపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. హైబ్రిడ్ ఐసీయూలో ఏసీలు పనిచేయడం లేదని, ఫ్యాన్లతో నెట్టుకొస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

### సేవలు మృగ్యం

ప్రాణాలు నిలుస్తాయని ఆశతో రోగులు, ఉత్తమ చికిత్స, వసతులు అందుబాటులో ఉంటాయని జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఇక్కడికే కేసులు రిఫర్ చేస్తుంటారు. 900 పడకల ఆసుపత్రిలో 32 వార్డులు, 8 ఐసీయూలు ఉన్నాయి. ఒక్కో వార్డులో రోజుకు మూడు షిఫ్టుల్లో పని చేసేందుకు కనీసం ముగ్గురు, ఐసీయూలో పని చేసేందుకు ఆరుగురు చొప్పున వైద్య సిబ్బంది ఉండాలి. ప్రసూతి విభాగంతో పాటు మొత్తం 32 వార్డులకు కనీసం 96 మంది, 8 ఐసీయూలకు 48 మంది ఎంఎన్‌వోలు అవసరం. ఆసుపత్రి మొత్తానికి కేవలం 28 ఎంఎన్‌వోలు మాత్రమే ఉన్నారు. 116 మంది సిబ్బంది కొరత ఉంది. ఆసుపత్రిలో 14 విభాగాలు ఉండగా 8 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. వీరంతా సూపరింటెండెంట్ ఆఫీసులోనే పని చేస్తున్నారు. మిగిలిన విభాగాల్లో కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన ఇతర ఉద్యోగులతో నెట్టుకొస్తున్నారు.

కోవిడ్ సమయంలో రిమ్స్‌కు పెద్ద ఎత్తున వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు వచ్చాయి. కోవిడ్ అనంతరం వాటి వినియోగం పూర్తిగా తగ్గిపోవడంతో ఆ పరికరాలను మూలన పడేశారు. ఆసుపత్రిలో పూర్తి సామర్థ్యంతో కేవలం 10 వెంటిలేటర్లు మాత్రమే పని చేస్తున్నాయి. కోవిడ్‌లో కొనుగోలు చేసిన వెంటిలేటర్లను కరోనా అనంతరం వినియోగంలోకి తీసుకురాలేదు. దీంతో 80 వెంటిలేటర్లు నిరుపయోగమయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. కోవిడ్‌లో మనుగడలోకి తీసుకొచ్చిన ఆక్సిజన్ ప్లాంట్లలో కొన్ని నిరుపయోగంగా మారాయి. 900 పడకల ఆసుపత్రికి కేవలం రెండు అంబులెన్స్‌లు మాత్రమే సేవలందిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లో అధికారులు ఆసుపత్రికి కావాల్సిన సౌకర్యాలపై ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకొనే నాధుడు లేడు.

## నాగావళి తీరంలో యోగాసనాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డోలాపౌర్ణమి (హోళీ) సందర్భంగా ఇస్కాన్ ఆలయం ఎదురుగా ఉన్న నాగావళి నదీతీరంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగాసనాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు మంత్రోచ్ఛారణతో చేశారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు నర్సింహమూర్తి, బోయిన నారాయణమూర్తి, డాక్టర్ ఇంజరాపు మోహనరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, సింహాచలం, తవిటినాయుడు, మనోహర్, వరప్రసాద్, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలల హక్కులపై శిక్షణ శిబిరం




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బాల్యవివాహాలు అరికట్టడం, బాలకార్మిక చట్టాల అమలు, బాలల అక్రమ రవాణా తదితర అంశాలపై అప్‌హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎచ్చెర్ల మండలం కొంగరాం గ్రామంలో మూడు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో మన్యం, శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాల నుంచి సుమారు 120 మంది పాల్గొన్నారు. అప్‌హోల్డ్ సంస్థ ఛైర్మన్ అంజూరి ఫిలిప్ తిమోతి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరంలో రిసోర్స్ పర్సన్స్‌గా డేవిడ్ రాజు, చంద్రశేఖర్ వ్యవహరించారు. బాల్యవివాహాల నిషేధచట్టం-2006, బాల కార్మిక నియంత్రణ చట్టం, పోక్సో చట్టాల గురించి శిక్షణ శిబిరంలో అవగాహన కల్పించారు.

## మహాలక్ష్మి అమ్మవారి జయంతి పూజలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయ అర్చకుడు బూరాడ వంశీకృష్ణమాచార్యులు నేతృత్వంలో క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రధారణతో సహా విశేష పూజలు నిర్వహించారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## 'నీరు-చెట్టు' కేసుల నుంచి విముక్తి

- మంత్రి అచ్చెన్నకు నీటిపారుదల ఉద్యోగుల కృతజ్ఞతలు -



(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

గతంలో నీరు-చెట్టు పనుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో వైకాపా ప్రభుత్వంలో కేసులు ఎదుర్కొన్న 386 మంది నీటిపారుదల శాఖ ఉద్యోగులకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం విముక్తి కల్పించింది. ఇందుకు కృషి చేసిన వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. తమ శాఖలోని వివిధ స్థాయిల ఉద్యోగులపై గత ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి విచారణ పేరుతో తమను ఐదేళ్లు ఇబ్బందులకు గురి చేసిందన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులన్నీ ఎత్తివేసిందని ఆనందం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో మంత్రిని కలిసిన ఉద్యోగులు తమ ఆనందం వ్యక్తం చేశారు. నీటిపారుదల శాఖ ఉద్యోగులు లోకేష్, శ్రీనివాసరావు తదిరులు పాల్గొన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 386 మందికి ఉపశమనం లభించగా, వారిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 26 మంది ఉన్నారని ఉద్యోగుల ప్రతినిధులు లోకేష్, శ్రీనివాసరావు తెలిపారు.

## రాజాంలో ఘనంగా హోలీ సంబరాలు



(సత్యంన్యూస్, రాజాం)

రాజాం పట్టణంలో శుక్రవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఉత్సాహంతో రంగులు చల్లుకున్నారు. స్థానిక మార్వాడీ కుటుంబాలవారు ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. స్థానిక రాజస్థానీలు పాటలు పాడుతూ హోలీ ఆడారు. మహిళలు ప్రత్యేక నృత్యాలు చేస్తూ వేడుకలు చేసుకున్నారు.

## మంత్రి అచ్చెన్న ఆధ్వర్యంలో ప్రజాదర్బార్



(సత్యంన్యూస్, కోటబొమ్మాళి)

ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కోటబొమ్మాళిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు పెద్ద సంఖ్యలో అందిన వినతులను ఆయన స్వయంగా స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అర్హత ఉన్నవారికి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, బగాది శేషు, టీడీపీ నాయకులు, నీటిపారుదల, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దమ్ముంటే పట్టుకో ఏసీబీ..

# డబ్బుకొట్టి వచ్చేస్తాం డ్యూటీకి

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తుతోంది. అది కూడా సొంత డిపార్ట్‌మెంట్ వ్యక్తుల నుంచే లంచం తీసుకోవడం మరీ ఘోరమని వ్యాఖ్యానిస్తున్నారు. అయితే ఈ తప్పు బాలరాజుదో, లేదా అంటే మరో డీబీసీడబ్ల్యూవోదో, ఇంకో హాస్టల్ వార్డెన్‌దో కాదు. ఏసీబీకి దొరికి కేసు కొనసాగుతుండగానే ఫోకల్ పాయింట్‌లో ఉద్యోగానికి రావడం, ఏసీబీ అధికారులు సిఫార్సు చేసిన శిక్షలు కాకుండా డబ్బు మూటలు ఇచ్చి నామ్ కే వాస్తేగా వారి శిక్షలను వారే ఖరారు చేసుకోవడం వల్ల ఎన్నిసార్లు దొరికినా ఏం కాదులే అన్న బలుపు ఎక్కువైపోవడం వల్లే ఏసీబీకి గతంలో దొరికినవారే మళ్లీ దొరుకుతున్నారు. ఏసీబీ అధికారులకు దొరికినా శాఖలో ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో సొమ్ములిచ్చి శిక్షలు లేకుండా తప్పించుకుంటున్నారు. ఏసీబీ అధికారులు కూడా కుంభకోణంలో పాత్రధారులంటూ అరెస్ట్ చేసినా ఛార్జిషీటు దగ్గరకు వచ్చేసరికి కొందర్ని తప్పిస్తున్నారు. వీటన్నింటికీ కారణం డబ్బే. అందుకే పుష్ప-2లో అల్లు అర్జున్ అన్నట్టు దమ్ముంటే పట్టుకోరా షకావత్తు.. పట్టుకుంటే వదిలేస్తా సిండికేటు అన్నట్టు బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు కూడా దమ్ముంటే పట్టుకో ఏసీబీ.. డబ్బుమూటలు కొట్టి వచ్చేస్తాం డ్యూటీకి అంటున్నారు.

స్కాలర్‌షిప్‌ల కుంభకోణం వెలుగుచూసినప్పుడు అప్పుడు డీబీసీడబ్ల్యూవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన బాలరాజు పేరుతోనే ఎక్కువ నిధులు దారి మళ్లింపునకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ఉన్నాయి. దీంతో నకిలీ స్కాలర్‌షిప్‌ల కుంభకోణంలో బాలరాజును ఏసీబీ సిఫార్సు మేరకు సస్పెండ్ చేశారు. ఇప్పుడు మళ్లీ ఆ కేసు నడుస్తుండగానే సొంత డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరి నుంచి లంచం తీసుకుంటూ బాలరాజు ఏసీబీ అధికారులకు దొరికిపోయారు. వాస్తవానికి ఈ దాడి ముఖ్య ఉద్దేశం బాలరాజును పట్టుకోవాలని కాదు. ఇదే ఆఫీసులో బాలరాజులాగే జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి, ప్రస్తుతం సూపరింటెండెంట్‌గా ఉన్న డి.పార్వతిని పట్టించాలని ప్రయత్నించారు. ఆమేరకు సూపరింటెండెంట్ పార్వతికి సొమ్ములివ్వాలని బాలరాజు బాధితులకు ఫోన్‌లో చెప్పిన రికార్డింగ్ ఏసీబీ అధికారుల వద్ద ఉంది. కానీ లంచం తీసుకునే సమయానికి పార్వతి లేకపోవడంతో మళ్లీ బాలరాజే దొరికిపోయాడు. వాస్తవానికి సూపరింటెండెంట్ పార్వతి కూడా ఏసీబీ కేసులో నిందితురాలే. 2012లో నాగరాణి డీసీడబ్ల్యూవోగా ఉన్నప్పుడు పార్వతి జూనియర్ అసిస్టెంట్‌గా పని చేశారు. నకిలీ స్కాలర్‌షిప్‌ల కుంభకోణంలో పార్వతి జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సమయంలో ఎక్కువ ప్రొసీడింగ్స్ ఉన్నాయని, అప్పటి ఏసీబీ డీఎస్పీగా పని చేసిన కరణం రాజేంద్ర 2107 జూన్ 9న పార్వతితో పాటు మరికొంత మందిని అరెస్ట్ చేశారు. ఇదే కేసులో 2016 మే 25న ఎఫ్ఐఆర్ వేశారు. 2017లో స్కాలర్‌షిప్ కుంభకోణం మీద 'ఈనాడు' కథనం ప్రచురించింది. దీని మీద ఏసీబీ డీఎస్పీ రంగరాజు కథనంలో పేర్కొన్న కాలానికి సంబంధించి రికార్డులు పరిశీలించారు. తీగ లాగితే డొంక కదలినట్లు 2014-15 విద్యాసంవత్సరానికి నకిలీ స్కాలర్‌షిప్‌లు ఇచ్చేసి, ఆ సొమ్ములు సంక్షేమ శాఖ అధికారులు తినేశారని 'ఈనాడు' కథనం సారాంశం. కానీ ఎప్పట్నుంచో ఇది జరుగుతుందని రికార్డులు పరిశీలించిన తర్వాత అర్థమైంది. దీంతో ముగ్గురు గుమస్తాలు కె.పార్వతి, బి.బాలరాజు, బి.చంద్రశేఖర్‌తో పాటు డీబీసీడబ్ల్యూవో బి.రవిచంద్ర, ఏటీడబ్ల్యూవో బి.ఎర్రన్నాయుడు, శ్రీకాకుళం బాలికల ట్రైబల్ హాస్టల్ వార్డెన్లు ఎస్.ఝాన్సీ, పాలకొండ ఎస్టీ హాస్టల్ వార్డెన్ జి.వెంకునాయుడుతో పాటు పాలకొండలో ఓంసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉమామహేశ్వరరావు, కంప్యూటర్ ఆపరేటర్ అజయ్‌కుమార్‌లను అరెస్ట్ చేశారు. విచిత్రమేమిటంటే.. అరెస్టయిన తర్వాత ఛార్జిషీట్ వంటి ప్రక్రియ దగ్గరకొచ్చేసరికి పార్వతి పేరు లేదు. ఆ సమయంలో ఏసీబీని ఆమె పెద్దఎత్తున మేనేజ్ చేశారన్న ఆరోపణలు కూడా వినిపించాయి. అప్పుడు తప్పించుకున్న పార్వతి మళ్లీ తాజాగా మరోసారి తప్పించుకున్నారు. బాలరాజు ఏసీబీ అధికారులకు దొరికిపోయిన తర్వాత డీఎస్పీకి ఇచ్చిన కన్ఫెషన్ స్టేట్‌మెంట్‌లోనైనా పార్వతి పేరు చెబితే ఆమెను కూడా బుక్ చేసివుండేవారు. కానీ తన సర్వీసు ఎలాగూ నాశనమైపోయింది కాబట్టి పార్వతి పేరు కూడా చెప్పి ఎందుకు నష్టపర్చడమనే కోణంలో బాలరాజు ఆ పాపం తనొక్కడిదే అని ఏసీబీ అధికారుల ముందు ఒప్పుకున్నట్టు భోగట్టా. 2014-15లో నకిలీ స్కాలర్‌షిప్‌ల కుంభకోణం వెలుగు చూసినప్పుడు జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న బాలరాజు కేవలం 18 ప్రొసీడింగ్స్‌లో మాత్రమే అక్రమాలకు పాల్పడినట్లు అప్పటి ఏసీబీ అధికారులు తేల్చారు. కానీ అంతకు ముందు 2012లో పార్వతి జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్నప్పుడు 100 శాతం అక్రమమేనని తేలాయి. అటువంటి పార్వతిని అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు ఆ తర్వాత మాత్రం ఆమె పట్ల ఉదారంగా వ్యవహరించారు. వాస్తవానికి బాలరాజుసు, పార్వతికి పడదు. ఆధిపత్య పోరులో వార్డెన్లు చెరోవైపు విడిపోయి రవిచంద్ర డీబీసీడబ్ల్యూవోగా పనిచేసిన రోజుల్లో సెక్సువల్ హెరాస్‌మెంట్ చేస్తున్నాడంటూ బాలరాజు మీద ఒక ఫిర్యాదు చేయించారు. అప్పటి కలెక్టర్ లక్ష్మీనృసింహం దీని మీద ఒక స్వచ్ఛంద సంస్థ యజమానురాలితో విచారణ చేయించారు. ఆమె ఏమేరకు విచారించారో తెలీదు గానీ వచ్చిన ఫిర్యాదు నిజమేనని నృసింహానికి నివేదిక ఇచ్చారు. దీంతో ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ రవిచంద్రను అప్పటి కలెక్టర్ కోరారు. తన కార్యాలయంలో ఏం జరుగుతుందో తనకు తెలుసు కాబట్టి, అసలు ఈ ఫిర్యాదు ఎందుకు పెట్టారో అవగాహన ఉండటంతో అక్కడ పని చేసేది ఆయనొక్కడేనని, ఆయన్ను సస్పెండ్ చేస్తే పనులు జరగవంటూ రవిచంద్ర లక్ష్మీనృసింహానికి చెప్పడంతో ఆగ్రహించిన కలెక్టర్ రవిచంద్రను బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి సరెండర్ చేసేశారు. 48 గంటలు గడిచాయో లేదో రవిచంద్ర మళ్లీ శ్రీకాకుళంలోనే పోస్టింగ్ తెచ్చుకున్నారు. దీనిపై కోపోద్రిక్తుడైన లక్ష్మీనృసింహం ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫోన్ చేసి రవిచంద్రను తాను విధుల్లో చేర్చుకోవడంలేదని, ఒకవేళ చేర్చుకోవాలని పట్టుబడితే తనను బదిలీ చేయాలని భీష్మించుకు కూర్చోవడంతో రవింద్రను అప్పటికప్పుడు విజయనగరం బదిలీ చేశారు. అంటే బీసీ సంక్షేమ శాఖలో ఏదైనా సాధ్యమే అని చెప్పడానికి ఈ ఉదాహరణలు సరిపోతాయి.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.